క్లుప్తంగా

రైతులను ఇబ్బంది పెడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

కేశంపేట: వర్షాభావ పరిస్థితుల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ సంస్కృతిక శాఖ జిల్లా కో కన్వీనర్ నరేందర్ రెడ్డి కోరారు. మండలంలోని సంతాపూర్ గ్రామంలో బుధవారం మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. రైతుల పక్షనా బీజేపీ పోరాడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి


కొందుర్గులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొందుర్గు: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బాలికల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనంలో ప్రతిరోజు ఆకు కూరలతోపాటు కూరగాయలు ఉండేలా చూడాలన్నారు. వారానికి మూడు ఉడికించిన గుడ్లు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి, భోజన వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కిష్టారెడ్డి, జీహెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించడంపై హర్షం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ తగ్గించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొందుర్గు మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి మాట్లాడుతూ బీజేపీ పేదల ప్రభుత్వమని గుర్తుచేశారు. వారిపై భారం పడకుండా వంట గ్యాస్ ధరలు తగ్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, బాలకృష్ణ, శాలయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నీరే ఆధారం

కేసారం సర్పంచ్ రమేశ్‌గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి 'నీరే' ఆధారమని కేసారం సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్ అన్నారు. ప్రతి వర్షపు చుక్కను కాపాడుకునే విధంగా ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలని కోరారు. చేవెళ్ల మండలంలోని కేసారం గ్రామంలో బుధవారం ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకావద్దు

ఇబ్రహీంపట్నం: పేదరికం చదువుకు అడ్డు కావద్దని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ అన్నారు. ఎంబీబీఎస్‌లో నిరుపేద కుటుంబానికి చెందిన మేఘన 11 వేల ర్యాంకు సాధించి సీటు దక్కించుకుంది. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం రాజు, చంద్రశేఖర్, ఆనంద్, హరిప్రసాద్, జమీర్, గోపాల్‌నాయక్‌లు పాల్గొన్నారు.

ఆత్మీయ బంధానికి 'రక్ష'

నేడే రాఖీ పండుగ
- ప్రేమానురాగాలకు ప్రతీక
- ఆధునిక కాలంలోనూ తగ్గని ఆధరణ
- జోరుగా అమ్మకాలు

షాబాద్: అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల ఆత్మీయ బంధానికి, ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్. మానవ సంబంధాలను పటిష్టం చేస్తూ సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సంప్రదాయమైన విలువలను మరింత ఉట్టిపడేలా చేస్తుంది. శ్రావణ పూర్ణిమ లేదా రాఖీ పూర్ణిమ రోజున అక్కా చెల్లెల్లు తమ అన్నదమ్ముల నుదుటన తిలకం దిద్ది చేతికి ప్రేమగా రాఖీ కట్టి మిఠాయిలు తినిపిస్తారు. సోదరులు తమ స్థోమతను తగినట్లుగా కానుకలు ఇస్తారు. ఆధునిక కాలంలోనూ ఏమాత్రం ఆదరణ తగ్గకుండా రాఖీపౌర్ణమిని జరుపుకొంటున్నారు. చుట్టరికంలోనేగాక బంధుమిత్రుల పిల్లలు, స్నేహితులు ఇలా ఎవరికైనా రాఖీ కడుతున్నారు.


షాబాద్: అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాఖీలు


మొయినాబాద్: రాఖీలు కొంటున్న మహిళలు


షాద్‌నగర్ రూరల్: విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు


మొయినాబాద్ రూరల్: దుకాణంలో మహిళల సందడి


చేవెళ్ల: దుకాణాల్లో మహిళల సందడి

వీధి దీపాలు ఏర్పాటుకు వినతి

కొత్తూరు: కొత్తూరు పట్టణం సమీపంలోని రైల్వే వంతెనకు ఇరువైపులా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సత్యసాయి కాలనీవాసులు కోరుతున్నారు. వంతనపై వెలుతురు లేక రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. గుంతలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ సమస్య రాకుండా పరిష్కరించాలని సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల కోరారు. చిలుకూరు సెక్షన్-ఎ పేరుతో కొత్త ఏఈని నియమించారు. కొత్త ఏఈ రాజ్‌బాబుతో పాటు మొయినాబాద్ ఏఈ అమోనాయక్‌లను మంజుల సన్మానించారు. మండలంలో రెండు సబ్ సెక్షన్‌లు ఏర్పాటు చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ఏఈ అమోనాయక్, ఉపసర్పంచ్ శ్యామ్ రావు, పంచాయతీ కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కృతజ్ఞతలు

మొయినాబాద్: గ్రామాల రోడ్ల అభివృద్ధికి మోక్షం లభించింది. మండలంలోని పలు గ్రామాల రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.17.72 కోట్ల నిధులు మంజూరు చేసింది. పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు అభివృద్ధికి రూ.2.80 కోట్లు, మొయినాబాద్‌లోని చాలెంజర్ స్కూల్ నుంచి ముర్తుజగూడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.45 కోట్లు, ముర్తుజగూడ నుంచి అమ్డాపూర్ రోడ్డు వరకు బీటీ వేయడానికి రూ.47 లక్షలు, శ్రీరాంనగర్ నుంచి అమ్డాపూర్ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.50 కోట్లు, అజీజ్‌నగర్-బాకారం రోడ్డులో మిగిలిపోయిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడానికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల రోడ్డు పనులు చేపట్టేందుకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. కనకమామిడి నుంచి వెంకటాపూర్ వరకు రోడ్డు అభివృద్ధికి రూ.6.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తైందని అధికారులు చెబుతున్నారు. వారం రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి. మండలంలో రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు

పైర్లకు తెగుళ్ల బెడద

- ఎప్పటికప్పుడు నివారిస్తే మేలు
- మండల వ్యసాయాధికారి వెంకటేశం

షాబాద్: మండలంలో సాగు చేస్తున్న మొక్కజొన్న, పత్తి, వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. తగిన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే ముప్పుతప్పదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. మొక్కజొన్న, వరి, పత్తిలో తెగుళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని మండల వ్యసాయాధికారి వెంకటేశం రైతులకు సూచించారు.

వరిలో తెగుళ్లు, నివారణ చర్యలు

ప్రస్తుతం వరికి తెగుళ్లు సోకేందుకు అనుకూలమైన పరిస్థితులున్నాయి. ముఖ్యంగా అగ్గి తెగులు ఆశించే ప్రమాదముంది. అగ్గి తెగులును పంటలో గమనిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. ట్రై సైక్లోజోల్ 0.5 గ్రాములు లేదా ఇసోప్రొథైయోలిన్ 0.5 మి.లీ లేదా మైసిన్ 2.5 మి.లీ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిలకలు లేదా దుబ్బ చేసే దశలో ఉన్న వరి పంటలో కాండం తొలిచే పురుగు ఆశించే ప్రమాదముంది. దీని నివారణకు 10 కిలోల కిర్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా 4 కిలోల క్లోరాంట్రినిలిప్రోల్ 0.4 జీ గుళికలను వేసుకోవాలి.

పత్తిలో నివారణ చర్యలు

పత్తి పంటలో పేనుబంక ప్రభావం కనిపిస్తోంది. దీని నివారణకు 5.మి.లీ వేపనూనే, 0.25 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలి. తామర పురుగు, పచ్చదోమ ఆశిస్తే 2 మి.లీ ఫిప్రోనిల్ లేదా 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్ లేదా 0.75 మి.లీ సల్ఫాక్సాఫ్లోర్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పండాకు తెగులు ఆశిస్తే మెగ్నీషియం ధాతు లోపం నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రాముల కాఫర్ ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కిర్పండిజమ్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని వ్యసాయాధికారి వెంకటేశం సూచించారు.


పత్తికి తెగుళ్ల బెడద

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. బుధవారం గోపులారంలో రూ. 6 లక్షలతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సర్పంచ్‌లు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషణం, వార్డు సభ్యులు శివలీల, వెంకట్‌రెడ్డి, సురేందర్, రమేశ్, సరిత, రాంచంద్రయ్య, ప్రధానోపాధ్యాయుడు ఆశీర్వాదం, గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రహరీ గోడ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

లోక్ అదాలత్‌లో 133 కేసుల పరిష్కారం

రిటైర్డ్ జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: చేవెళ్లలో ట్రాఫిక్ కేసులపై నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొదటి రోజు 133 కేసులను పరిష్కరించినట్లు రిటైర్డ్ జడ్జి సాంబశివరావు తెలిపారు. బుధవారం చేవెళ్ల కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల డివిజన్‌తో పాటు శంకర్‌పల్లి, షాబాద్ మండలాల పరిధిలోని ట్రాఫిక్ కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను 10 రోజుల పాటు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డుపై వాహనాలను డ్రైవ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. లోక్ అదాలత్‌లో ఎస్‌ఐలు విఠల్‌రెడ్డి, చందర్‌నాయక్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


లోక్ అదాలత్‌లో పాల్గొన్న సాంబశివరావు తదితరులు

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటప్ప

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగస్తులందరూ.. సీపీఎస్‌ను అమలు చేసిన సెప్టెంబర్ 1న విద్రోహ దినంగా పాటించాలని అన్నారు. పదోన్నతులతో పాటు బదిలీలను వెంటనే చేపట్టాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరుతూ శుక్రవారం యూఎస్‌పీఎస్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కువద్ద నిర్వహిస్తున్న మహాధార్నాను విజయవంతం చేయాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, కిషన్‌చౌహాన్, నర్సింహులు, నాయకులు కృష్ణ, బాలయ్య, బాలకృష్ణ, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును అభివృద్ధి చేయండి

కొత్తూరు: మండలకేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల హస్టల్‌కు వెళ్లే ప్రధాన రోడ్డును అభివృద్ధి చేయాలని ఏబీవీపీ మండల కన్వీనర్ నరేశ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. రాత్రి హాస్టల్‌కు వెళ్లేందుకు సిబ్బంది, విద్యార్థినీలు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖా అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు.

చీరల పంపిణీ

కేశంపేట: మండల పరిధిలోని కొనాయపల్లి, సంగెం, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో పాలమూరు చారిటబుల్ ట్రస్టు అధ్వర్యంలో 18 ఏళ్లు పైబడిన మహిళలకు ఆ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొనాయపల్లి, సంతాపూర్ సర్పంచులు మల్లేశ్, అంజయ్య, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.

శివ లింగం ధ్వంసం


శివ లింగాన్ని ధ్వంసం చేసిన దుండగులు

నందిగామ: వెంకటగిరి కొండపై వెలసిన పూరతణమైన శివ లింగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం సాయంత్రం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఇన్‌స్పెక్టర్ సురేశ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని ఒక వర్గం యువకులు ఉద్దేశపూర్వకంగానే శివ లింగాన్ని ధ్వంసం చేశారని నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ర్యాలీ తీసేందుకు గ్రామస్తులు ప్రయతి్నంచగా ఇన్‌స్పెక్టర్ వారిని సముదాయించి ర్యాలీని తీయకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు.

ప్రమాణస్వీకారానికి ఆహ్వానం


ఎమ్మెల్యే యాదయ్యను కలిసిన నాయకులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన జూలకంటి పాండురంగారెడ్డి బుధవారం ఎమ్మెల్యే యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 5వ తేదీన అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాపారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం

బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగరాజు

కొత్తూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని కొత్తూరు మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి అన్నారు. కేంద్రం వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ. 200 తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతో పట్టణంలో బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే దేశం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించిందని వివరించారు. కేంద్రం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాల్లో బీటీ రోడ్లు, జాతీయ రహదారుల విస్తరణ, అయా పట్టణాల్లో విమానాశ్రాయాలతో పాటు పలు ప్రాజెక్టులను చేపట్టి పూర్తి చేశారని గుర్తుచేశారు. అయితే తెలంగాణలో మాత్రం సీఎం కేసీఆర్ ప్రభుత్వం కేవలం మాటలతో పాలన సాగిస్తూ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, గణేశ్, జగన్‌గౌడ్, సందీప్‌సింగ్, నవీన్, శ్రీశైలం పాల్గొన్నారు.


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం


ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీ సాధించి హ్యాట్రిక్ విజయం సాధిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. బుధవారం కొందుర్గు మండల పరిధిలోని ఆగిర్యాల, ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరం గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతపైనే దేశ భవిష్యత్తు


ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షా బంధన్

షాబాద్: ప్రతి విద్యార్థి తప్పనిసరిగా దేశభక్తి కలిగి ఉండాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యార్థినీలు రాఖీలు కట్టారు. అనంతరం సూర్యప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల భాద్యత కలిగి ఉండాలని సూచించారు. దేశభక్తిలో విషయాల్లో రాజీపడే ప్రసక్తేలేదని చెప్పారు. యువతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రవీణ్ తదితరులున్నారు.